వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ప్రజా కంటకులకు తాఖీదు

పోరాటాల గడ్డ పొలికేక వేసింది. దుర్యోధన, దుశ్శాసన దుర్వినీత పాలనపై కురుక్షేత్ర యుద్ధం ప్రకటించింది. అమీతుమీ తేల్చుకుందామని బరి గీసి నిల్చింది, తొడగొట్టి పిలిచింది. కాంగ్రెస్ పాలనపై వెల్లువెత్తుతున్న ప్రజాపోరాటాలకు కోస్గి సభ ఓ మూలమలుపు. ఇష్టారాజ్యపు హుంకారం ఇంకానా, ఇకపై సాగదని తేల్చిచెప్పిన ధిక్కారం. సీఎం రేవంత్ రెడ్డి సొంత ఇలాకాలో బీఆర్ఎస్ జనాక్షౌహిణుల సాక్షిగా విసిరిన సవాలు విజయుని శంఖారావం. పాలకుల గుండెల్లో మోగిన ఢంకాధ్వానం. కోస్గి జనసముద్రం హోరు ప్రజా కంటకుల పాలిట రాబోయే తుఫాను పంపిన తాఖీదు. ఏమి జనం? ఏమా సమరోత్సాహం? భూమిని చెరపట్టాలని చూసే హిరణ్యాక్షుల పాలిట రైతు నిరసన దీక్ష ఓ అగ్నిపరీక్ష. పచ్చని పొలాలను ఎండబెట్టి.. సాగును పండబెట్టి.. భూమి పుత్రులను తరిమికొట్టి.. కార్పొరేట్ రాబందులకు కట్టబెట్టి.. పబ్బం గడుపుకోవాలనే దుర్మార్గ పాలనకు చరమగీతం. కాంగ్రెస్ దుర్భర పాలనపై జన విద్యుద్ఘాతం.

స్వరాష్ట్రాన్ని సాధించిన పార్టీ సాగును బాగుచేసి రైతును రాజును చేసింది. దండగన్న వ్యవసాయం పండుగైంది. కానీ అరచేతిలో స్వర్గం చూపి అందలమెక్కిన కాంగ్రెస్ పాలనలో రైతు బతుకు ఆగమాగమైంది. పంటసాయానికి మంటబెట్టి, రుణమాఫీకి టోపీ పెట్టి తమాషా చేస్తుండటంతో నిత్యనరకమైంది. మరోవైపు భూముల సేకరణ పేరిట రైతులకు నిద్రలేకుండా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ తలపెట్టిన రైతు నిరసన దీక్ష ఓ పెను ఓదార్పులా మారింది. కోస్గి సభకు వచ్చిన అశేష ప్రజానీకమే ఇందుకు నిదర్శనం. జనం నాడి, వాడి తెలిసిన కేటీఆర్ రాక ఓ ఉద్వేగ సందర్భం. దారిపొడవునా జనం నీరాజనాలెత్తింది. పూలు పరిచింది. గుండె తలుపులు తెరిచింది. మా కన్నీళ్లు తుడిచేవాడు, మా కోసం నిలిచేవాడు వచ్చాడని ఉప్పొంగిన ఉత్సాహం వెల్లి విరిసింది. ఆత్మీయ ఆలింగనంతో పోరుగడ్డలో పోటెత్తిన భావావేశం. అధికార మదంతో, లాఠీల బలంతో రైతుల నుంచి భూమిని విడదీసేందుకు జిత్తులమారి పాలకులు వేసిన ఎత్తులపై తిరగబడి విరగపోట్లు పొడిచిన లగచర్ల స్ఫూర్తికి కోస్గి సభ ఓ జయకేతనం. పోరాటపు ఆటుపోట్లను తట్టుకుని పురుడు పోసుకున్న బిడ్డకు 'భూమి నాయక్' అని కేటీఆర్ పేరుపెట్టిన క్షణం అపురూపమైన ప్రజానుబంధానికి దర్పణం.

గులాబీ రెపరెపల మధ్య బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఉద్వేగభరిత ప్రసంగం జనం గుండె చప్పుడును ప్రతిధ్వనించింది. మోసకారి వాగ్దానాలతో గద్దెనెక్కి, మాయదారి ఎగవేతలతో పబ్బం గడుపుకోవాలని చూస్తున్న కాంగ్రెస్ పాలనపై ఆయన సంధించిన ప్రశ్నలు ప్రజల గుండెల్లోంచి సూటిగా దూసుకు వచ్చినవే. అనుకోకుండా, అప్పనంగా దొరికిన సీఎం కుర్చీని అడ్డుపెట్టుకుని అధికారాన్ని అస్మదీయుల జాగీరుగా మార్చుకున్న సీఎం రేవంత్ రెడ్డి దమ్ముంటే మళ్లీ పోటీ చేయాలన్న సవాలు మోసపోయి గోస పడుతున్న జనం విసురుతున్నదే. నాటికీ, నేటికీ బీఆర్ఎస్ సిద్ధాంతం, ఆచరణ ఒక్కటే. పాలకపక్షమైనా, విపక్షమైనా ప్రజల పక్షాన నిలవడమే. దోపిడీపై, పీడనపై కలబడి పోరాడి గెలవడమే. ఆ సంగతి కాంగ్రెస్ పాలకులు గుర్తుంచుకుంటే మంచిది.

బీఆర్ఎస్ చూపిన బాట ఉంది కదా

దశాబ్ద కాలం క్రితం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే (ఎస్కేఎస్), ఇటీవల నిర్వహించిన తెలంగాణ కులగణన సర్వే (టీసీఎస్) గణాంకాల మధ్య బీసీ జనాభా శాతం విషయంలో వ్యత్యాసం ఉన్నదన్న చర్చ తీవ్రంగా జరుగుతున్నది. బీసీల జనాభా శాతం పెరిగిందన్న ప్రభుత్వ వాదన సరైనది కాదని బీఆర్ఎస్ నాయకులు సోదాహరణంగా గణాంకాలతో ఉటంకిస్తూ విభేదిస్తున్నారు. టీసీఎస్‌లో పెరిగిన బీసీల శాతం ముస్లిం బీసీలను, జనరల్ బీసీ క్యాటగిరీలో చేర్చడం వల్లేనన్నది బీఆర్ఎస్ నాయకుల వాదన.

వనం జ్వాలా నరసింహారావు



ఒక ప్రధాన ప్రతిపక్షంగా, గతంలో చిత్తశుద్ధితో సమగ్ర కుటుంబ సర్వే చేసిన పార్టీగా బీఆర్ఎస్ ఇచ్చే సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. ఎస్కేఎస్, టీసీఎస్‌లలోని మెరుగైన అంశాలను తీసుకొని అవసరమైతే ఒక శాస్త్రీయ ప్రత్యామ్నాయ హైబ్రిడ్ మాడల్ రూపొందించే ఆలోచన చేస్తామని సభాముఖంగా సభానాయకుడు శాసనసభలో హామీ ఇచ్చినట్టయితే ఆయన వ్యక్తిత్వం ఆకాశం ఎత్తున ఎదిగేది. అదొక మేలైన మార్గంగా పరిణమించడానికి బాటలు వేసేది. తద్వారా రాజకీయాలకు అతీతంగా రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరువలోకి వచ్చే సదవకాశం పరిపూర్ణంగా కలిగేది.

ప్రభుత్వం, దాని నాయకుడి వాదననే పరిగణలోకి తీసుకుని విశ్లేషిస్తే, వారు చెప్తున్నట్టు తెలంగాణ కులగణన ఎంత మేలు కలిగించేదైనప్పటికీ, బీసీ జనాభా శాతం గణనలో తేడాలు, ముస్లిం బీసీలను హిందూ బీసీలతో కలిపి చూపడం లాంటి అంశాలు చర్చకు అవకాశం ఇస్తున్నాయి. సమగ్ర కుటుంబ సర్వే లెక్కలతో వీటిని పోల్చి చూపిస్తూ, బీఆర్ఎస్ నాయకులు పేర్కొంటున్న వ్యత్యాసాలను, అధికారపక్ష నాయకులు ఎవరికి నచ్చిన రీతిలో వారు, శక్తివంచనలేకుండా తమ వాదనను సమర్థించుకోవడం హాస్యాస్పదం. ఎస్కేఎస్ 100 శాతం గృహ గణనను జరిపి గణాంకాలను క్రోడీకరించగా, దీనికి భిన్నంగా, టీసీఎస్ కేవలం 96.9% కవరేజీ మాత్రమే సాధించింది. ఆ గణన ఆధారంగానే, కులాల వారీగా వివరమైన విభజనను అందించింది. సమగ్ర కుటుంబ సర్వే, కులగణన సర్వేలు రెండింటినీ సమన్వయపరుస్తూ, గణాంకాలను సమగ్రంగా విశ్లేషించి, సంక్షేమం, రిజర్వేషన్ విధానాలను రూపొందించడం ప్రభుత్వానికి మంచిది.

సమగ్ర కుటుంబ సర్వే దేశంలోనే అలా నిర్వహించిన వాటిలో మొదటిది. 2014 ఆగస్టు 19న నాడు 90 లక్షల కుటుంబాలను కవర్ చేస్తూ నిర్వహించారు. ప్రతి ఒక్కరి సమగ్ర సామాజిక-ఆర్థిక గణాంకాలను సేకరించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను పటిష్టంగా, లాభదాయకంగా అర్హులైనవారికి అందేలా చూడడం సర్వే మౌలిక లక్ష్యం. మానవ వనరుల సహాయంతో ఒకే ఒక్క రోజులో పూర్తి డాటా సేకరించి, కేవలం 14 రోజుల్లో కంప్యూటర్‌లో డాటా ఎంట్రీ చేశారు. ఇదే బాటలో దశాబ్దం తరువాత మొదటి 'కులగణన' అంటూ 1.12 కోట్ల కుటుంబాలను కవర్ చేసినట్టు ప్రభుత్వం చెప్తున్నది. ఈ గణనకు ఎస్కేఎస్‌లాగా ఒకే ఒక్క రోజులో కాకుండా 50 రోజులకు పైగా సమయం పట్టింది.

బీసీల హక్కుల సాధన విషయంలో, రిజర్వేషన్ల విషయంలో రాజకీయ విభేదాలను పక్కన పెట్టాలి. రేవంత్‌రెడ్డి కేవలం అసెంబ్లీలో చెప్పడమే కాకుండా త్రికరణశుద్ధితో దాన్ని ఆచరణలో పెట్టడానికి చొరవ తీసుకోవాలి.

సర్వేల మధ్య సారూప్యతలు, వ్యత్యాసాలు ఉన్నాయనేది వాస్తవం. సమగ్ర కుటుంబ సర్వే 100 శాతం గణన ఆధారంగా బీసీల జనాభాను 51 శాతంగా పేర్కొన్నది. టీసీఎస్ 96.9 శాతం కవరేజీ ఆధారంగా బీసీల జనాభాను 56.33 శాతంగా పేర్కొంటూనే, హిందూ బీసీలు 46.25 శాతం, ముస్లిం బీసీలు 10.08 శాతం అని మెలిక పెట్టింది. షెడ్యూల్డ్ కులాలు ఎస్కేఎస్‌లో 18 శాతం కాగా, టీసీఎస్‌లో 17.43 శాతం. షెడ్యూల్డ్ తెగలు ఎస్కేఎస్‌లో 10 శాతం కాగా, టీసీఎస్‌లో 10.45 శాతం. ఇతర కులాల వారు (ఓసీలు) ఎస్కేఎస్‌లో 21 శాతం కాగా, టీసీఎస్‌లో 15.79 శాతంగా నమోదైంది. రెండు సర్వేల్లో ఎస్సీ, ఎస్టీ శాతాలు దాదాపు ఒకేలా ఉండటం గమనార్హం. ఎస్కేఎస్ 51 శాతం బీసీ జనాభాలో ముస్లిం బీసీలు లేరు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల పెంపుదల విషయంలో పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందనడంలో సందేహం లేదు. ఫిబ్రవరి 4న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో మాట్లాడుతూ కేంద్రం కూడా టీసీఎస్ తరహాలో కుల, సామాజిక-ఆర్థిక సర్వే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. టీసీఎస్ చారిత్రక ప్రాముఖ్యతను రేవంత్ నొక్కి వక్కాణిస్తూ బీసీల హక్కుల సాధన విషయంలోనూ, రిజర్వేషన్ల విషయంలోనూ రాజకీయ విభేదాలను పక్కన పెట్టాలని సూచించారు. కానీ, ఏడేండ్లు వెనక్కి వెళ్తే 2017 ఏప్రిల్ 16న తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ బిల్లు అసెంబ్లీలో ఆమోదించబడిన వేళ, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వే డాటా పరిపూర్ణమైనదని, అత్యున్నత న్యాయస్థానం విధించిన 50 శాతం పరిమితిని దాటి రిజర్వేషన్లు పెంచడానికి అది సూచించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నదని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకు కేసీఆర్ అపారమైన చొరవ తీసుకున్నారు. అలాగే, ముస్లిం బీసీ-ఈ రిజర్వేషన్‌ను 4 శాతం నుంచి 12 శాతానికి, ఎస్టీ రిజర్వేషన్‌ను 6 శాతం నుంచి 10 శాతం, ఎస్సీ రిజర్వేషన్‌ను 15 శాతం నుంచి 16 శాతానికి పెంచే ప్రతిపాదన చేశారు. న్యాయపరమైన అడ్డంకులను అధిగమించి, రాష్ట్రంలో బీసీలకు రిజర్వేషన్ల (42 శాతం) పెంపుతో సహా, మొత్తం రిజర్వేషన్లను 62 శాతానికి తీసుకొస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆ దిశగా నిరంతర కృషి చేశారు.

బీసీ రిజర్వేషన్ల విషయంలో రాజకీయ ప్రయోజనాల కోసం గణాంకాలను వాడుకోవడం కాకుండా, వాటిని సామాజిక న్యాయ సాధనంగా ఉపయోగించాలి. ఏదేమైనా, కేసీఆర్, రేవంత్ అనుసరించే మార్గాల్లోనే వ్యత్యాసం కనబడుతున్నది. ఎవరి మార్గాన్ని ఎవరు అనుసరిస్తున్నారో, అనుకరిస్తున్నారనేది వేరే సంగతి. కాకపోతే, వినయంగా వాస్తవాలను అంగీకరించకపోవడంలోనే తేడా కనిపిస్తున్నది. రాజకీయమంటే ఇదేనేమో! 'మీ చర్యలు ఇతరులను మరిన్ని కలలు కనేటట్టు, మరికొంత ఎక్కువగా నేర్చుకునేటట్టు, ఎక్కువ పనిచేసేట్టు, ఇంకా మెరుగయ్యేటట్టు ప్రేరేపిస్తే, అప్పుడు మీరు నిజమైన నాయకుడు అవుతారు' అని అమెరికా 6వ అధ్యక్షుడు జాన్ క్విన్సీ ఆడమ్స్ అన్నారు. అంటే, నాయకుడి ప్రధాన బాధ్యత, తాను నడుస్తూ, ఇతరులను తనతోపాటు నడిపిస్తూ లక్ష్యసాధన దిశగా మలచుకోవడం. సర్వేలు, డాటాను పక్కన పెడితే ఎవరు ఎవరిని ప్రేరేపించారు? ఎవరి ప్రభావం ఎవరిమీద పడింది? అనేది అందరూ గుర్తించాల్సిన అవసరం ఉన్నది.

కులగణన సర్వేలో ముస్లిం బీసీలను జనరల్ బీసీ క్యాటగిరీలో చేర్చడం వల్ల, హిందూ బీసీల వాటా తగ్గిపోతుందని బీసీ నేతలు, మేధావులు భావిస్తున్నారు. ఆందోళన పడుతున్నారు. ఇది సహజం. సర్వే డాటాను సమాజ వాస్తవాలను ప్రతిబింబించేలా, మారుతున్న సామాజిక, ఆర్థిక అవసరాలకు అనుగుణంగా రిజర్వేషన్ విధానాన్ని విశ్లేషించాల్సిన అవసరం ఉన్నది.

అందుకే భేషజాలను పక్కనపెట్టి, ఎస్కేఎస్ డాటాను తెలంగాణ కులసర్వే డేటాకు ఎలా అనుసంధానం చేయవచ్చో ఆలోచించాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర అణగారిన వర్గాలకు మేలు కలిగేలా పూర్తిస్థాయిలో ప్రత్యామ్నాయ హైబ్రిడ్ మాడల్‌ను రూపొందించాలి. వివాదాన్ని తీవ్రతరం చేయకుండా పరిష్కారాన్ని కనుగొనడానికి ప్రయత్నం జరగాలి. సామాజిక-ఆర్థిక దృక్పథంలో సమతుల్య అభివృద్ధి అవసరం. దానికి చొరవ చూపాల్సింది ప్రభుత్వమే.

వివిధ రంగాలకు చెందిన బీసీ సామాజిక వర్గాల ప్రతినిధుల భయాలను ప్రభుత్వం తొలగించాలి. ప్రభుత్వం, మేధావులు, అధికార-ప్రతిపక్ష బీసీ నాయకులు ఉమ్మడిగా రాజకీయ అడ్డంకులను అధిగమించే దిశగా ఎవరిపాత్ర వారు పోషించాలి. నెల రోజులు ఆలస్యమైనా ఏకాభిప్రాయ సాధనకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పూనుకోవాలి. బీసీల హక్కుల సాధన విషయంలో, రిజర్వేషన్ల విషయంలో రాజకీయ విభేదాలను పక్కనపెట్టాలి. రేవంత్‌రెడ్డి కేవలం అసెంబ్లీలో చెప్పడమే కాకుండా త్రికరణశుద్ధితో దాన్ని ఆచరణలో పెట్టడానికి చొరవ తీసుకోవాలి. సర్వపక్ష ఆమోదమార్గం అన్నిటికన్నా ఉత్తమమైనది. దీని ద్వారా ఒక సమతుల్యమైన హైబ్రిడ్ మాడల్ అమలుకు మార్గం సుగమం అవుతుంది. సమగ్ర కుటుంబ సర్వే అయినా, తెలంగాణ కుల సర్వే అయినా, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు తమ హక్కులను పరిరక్షించుకోవాలి. ఆ దిశగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి వేసిన బలమైన పునాదుల మీద నిర్మాణం చేసే బాధ్యత మలి ముఖ్యమంత్రి మీద వున్నది. ■

సుప్రీం ఏమన్నా.. చరిత్రాత్మకమే!

తెలంగాణ శాసన సభ్యులు పార్టీ మారిన వ్యవహారంపై సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. వారికి అనుకూలంగా తీర్పు ఇచ్చినా, వ్యతిరేకంగా ఇచ్చినా అది చరిత్రాత్మకం అవుతుంది. ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలో చేరడమంటే ప్రజా తీర్పును అపహాస్యం చేసినట్టే. ఎన్నికలు పార్టీ ప్రాతిపదికన జరుగుతాయి. కాబట్టి ప్రజలు అభ్యర్థికి విడిగా ఓటువేయరు. ఒక పార్టీ ప్రతినిధిగానే ఓటు వేస్తారు. ఒక పార్టీ తరపున గెలిచి మరో పార్టీలో చేరడమంటే ప్రజల తీర్పును కాలరాసినట్టే. ఇప్పటి వరకు పార్టీ మార్పిడి చట్టాన్ని తుంగలో తొక్కి ఇష్టం వచ్చినట్టు పార్టీలు మారుతున్నారు. ఇప్పటి వరకు ఇది బాగానే సాగింది. చట్ట వ్యతిరేక చర్య అందరూ చేస్తే అది చట్టబద్ధం అవుతుందా ?

బుద్దా మురళి

శాసన సభ్యులు ఇలా పార్టీలు మారడం ఇదే మొదటిసారి కాదు. ఈ వ్యవహారం కోర్టులకు వెళ్లడమూ మొదటిసారి కాదు. కానీ సుప్రీంకోర్టు ఈసారి సీరియస్‌గానే స్పందించింది. 'పార్టీ మారిన ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవడానికి ఎంతకాలం పడుతుంది? మహారాష్ట్రలో మాదిరిగా శాసన సభ్యుల పదవీకాలం ముగిసే నాటికి నిర్ణయం తీసుకుంటారా?' అని ఘాటుగా ప్రశ్నించింది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ఏ రాష్ట్రంలోనైనా శాసన సభ్యులు పార్టీ మారినప్పుడు ఆ పార్టీ స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తుంది. నిర్ణయాధికారం స్పీకర్‌దే. పేరుకు స్పీకర్ తటస్థులని చెప్పుకున్నా అలా ఉండడం సాధ్యం కాదు. స్పీకర్ కూడా ఐదేండ్లు కాగానే మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలి. పార్టీ టికెట్ కావాలి. రాజకీయ మనుగడకు పార్టీ ఆశీస్సులు కావాలి. అందుకోసం స్పీకర్ సహజంగానే పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తారు. పార్టీ మారి అధికార పక్షంలోకి వచ్చిన శాసన సభ్యులను కాపాడటానికి సహకరిస్తారు. కానీ, చట్ట ప్రకారం వారి సభ్యత్వాన్ని రద్దు చేయరు. అయితే, చట్ట ప్రకారం వ్యవహరించినట్టుగా నటించడం కోసం శాసనసభ్యుల సభ్యత్వ గడువు ముగిసే సమయంలో నిర్ణయం తీసుకుంటారు.

పెండ్లిలో అదిగదిగో అరుంధతి నక్షత్రం అని పూజారి చూపిస్తే పెళ్లికొడుకు అరుంధతి నక్షత్రం మా మేనత్తే అన్నంత ధీమాగా పెళ్లి కూతురుకు నక్షత్రాన్ని చూపుతూ ఫొటో దిగుతాడు. అరుంధతి నక్షత్రం నిజానికి వారెవరికీ కనిపించదు. పెండ్లిలో ఇదో తంతు మాత్రమే. పార్టీ మార్పిడి నిరోధక చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం సైతం ప్రజాస్వామ్యంలో ఉత్తుత్తి తంతుగా మారింది. తెలంగాణ శాసన సభ్యుల పార్టీ మార్పిడి కేసులో సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలను బట్టి చూస్తే ఇంతకాలం హాస్యాస్పదంగా మారిన పార్టీ మార్పిడి నిరోధక చట్టానికి కోర్టు తన నిర్ణయంతో గౌరవాన్ని పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. వారం రోజుల్లో స్పందించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఎమ్మెల్యేలకు శాసనసభ నోటీసు ఇచ్చింది. వారు గడువులు కోరుతూనే ఉంటారు. శాసనసభ సభ్యత్వ కాలం ముగిసేంత వరకు సమాధానం ఇవ్వడానికి గడువు కోరుతూనే ఉంటారు. అదే జరిగితే పార్టీ మార్పిడి నిరోధక చట్టం లేనట్టే. అధికార పక్షంలోకి మారితే ఏమీ కాదు, విపక్షంలోకి మారితే సభ్యత్వం రద్దు అవుతుంది అని చట్టం చెప్పినట్టే.

శాసనసభ, న్యాయ వ్యవస్థ స్వతంత్ర సంస్థలు. ఒక వ్యవస్థ తన బాధ్యత నెరవేర్చనప్పుడు, బాధితులు తనను ఆశ్రయించినప్పుడు న్యాయ వ్యవస్థ స్పందించాలి. చట్టాన్ని కాపాడాలి. శాసన సభ్యులు పార్టీ మారినప్పుడు న్యాయ వ్యవస్థ తనంతట తానే స్పందించి చర్యలు తీసుకుంటే జోక్యం చేసుకున్నట్టు భావించవచ్చు. కానీ ఈ వ్యవహారంలో స్పీకర్ చర్య తీసుకోలేదని బాధిత పక్షం న్యాయ వ్యవస్థను ఆశ్రయించింది. చట్ట సభల ప్రతినిధులు తాము రూపొందించిన చట్టాన్ని తామే గౌరవించనప్పుడు న్యాయ వ్యవస్థ తీర్పు చట్టం గౌరవాన్ని పెంచినట్టు అవుతుంది.

మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో గురువారం జరిగిన కాంగ్రెస్ పార్టీ శాసన సభా పక్షం సమావేశానికి పొరపాటున ఇద్దరు పార్టీ మారిన శాసన సభ్యులు వస్తే 'సుప్రీంకోర్టులో కేసు ఉంది మీడియా కంట పడకండి' అని వారిని దొడ్డిదారిలో వెనక్కి పంపించిన వార్త నవ్వు తెప్పిస్తుంది. కాంగ్రెస్ పార్టీ మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో 'జై భీం', 'జై బాపు', 'జై సంవిధాన్' పేరుతో రాజ్యాంగ పరిరక్షణ కోసం గొప్ప సభ నిర్వహించింది. దేశంలోని కాంగ్రెస్ పెద్దలంతా వచ్చి బీజేపీ వల్ల రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, మనమంతా కలిసి రాజ్యాంగాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం నుంచి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం రాజ్యాంగం ఎంత పవిత్రమైందో చెప్తూ, దానిని పరిరక్షించే బాధ్యత మన భుజాలపైన పడిందని చక్కగా మాట్లాడారు. బీఆర్ఎస్ నుంచి పదిమంది శాసన సభ్యులు కాంగ్రెస్‌లో చేరారు. ఇలా పార్టీ మారిన వారిలో కడియం శ్రీహరి కూడా ఉన్నారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వలేదు కానీ సంవిధాన్ సభలో రాజ్యాంగం గురించి, విలువలతో కూడిన రాజకీయాల గురించి మాట్లాడే అవకాశం ఇస్తే రేవంత్ కన్నా కడియం శ్రీహరి అద్భుతంగా మాట్లాడేవారు. కడియం నిరంతరం రాజకీయాల్లో విలువలు గురించి మాట్లాడేవారు. మూడు దశాబ్దాల క్రితం చంద్రబాబు మంత్రి వర్గంలో మంత్రి పదవి రాగానే మీడియాను భోజనానికి పిలిచారు. భోజనం చేస్తుంటే ఈ భోజనం బిల్లు నా సొంత జేబు నుంచి చెల్లిస్తున్నాను, కాంట్రాక్టర్ల ద్వారా కాదు అని చెప్పుకొచ్చారు. అప్పుడాయన ఇరిగేషన్ మంత్రి. సాధారణంగా భోజనం సమయంలో బిల్లు ఎవరు ఇస్తారు అనే చర్చ రాదు. నాకు రాజకీయాల్లో విలువలు ముఖ్యం అందుకే ఇది చెప్తున్నానని అప్పుడు కడియం సమర్థించుకున్నారు. అంతటి విలువలతో కూడిన రాజకీయాలు నడిపే కడియం శ్రీహరి బీఆర్ఎస్ అధికారంలో ఉన్నంత వరకు పార్టీలో ఉన్నారు. చివరకు పార్లమెంట్ ఎన్నికల్లో తన కుమార్తెకు వరంగల్ పార్లమెంట్ టికెట్ కేటాయించే వరకు ఉన్నారు. ఓ వర్షం కురిసిన రాత్రి మెరుపు మెరిసి జ్ఞానోదయం అయినట్టు బీఆర్ఎస్‌లో నియంతృత్వం కనిపించి కాంగ్రెస్‌లోకి జంప్ అయ్యారు. బీఆర్ఎస్ ద్వారా వచ్చిన సభ్యత్వానికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరితే విలువలతో కూడిన రాజకీయం అనే ఉపన్యాసాలకు సార్థకత ఉండేది.

ఇక, కాంగ్రెస్ పార్టీ శాసనసభా పక్ష సమావేశానికి సైతం వెళ్లలేని పరిస్థితి పార్టీ మారిన శాసన సభ్యులది. సుప్రీంకోర్టులో కేసు ఉంది కాబట్టి ఆధారాలు ఇచ్చినట్టు అవుతుందని పదిమందినీ దూరం పెట్టారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్ ఏకంగా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు.

స్పీకర్‌గా ఒకప్పుడు శాసనసభను నడిపిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇప్పుడు పార్టీ మారి 'ఆధారం దొరుకుతుందని' కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశానికి వెళ్లలేని దుస్థితి. పార్టీ మారిన ఈ పదిమంది శాసన సభ్యుల పరిస్థితి 'రెంటికి చెడ్డ రేవడి' సామెతలా మారింది. తెలంగాణలో పదిమంది బీఆర్ఎస్ శాసన సభ్యులను తమ పార్టీలో చేర్చుకోవడంపై రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ హైకమాండ్ ఆశీస్సులు కూడా ఉన్నాయి. తన నియోజక వర్గం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేని కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై జీవన్‌రెడ్డి బహిరంగంగానే మండిపడ్డారు. హై కమాండ్ పిలిచి ఎందుకు చేర్చుకుంటున్నారో చెప్పే సరికి చల్లబడ్డారు.

ఒక వైపు విలువలకు తిలోదకాలు ఇస్తూ శాసన సభ్యులను చేర్చుకుంటూ, దానిని తమ విజయంగా భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ సంవిధాన్ సభలు పెడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని ఉపన్యాసాలు ఇవ్వడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే. పార్టీ మారిన శాసన సభ్యుల వ్యవహారంలో సుప్రీంకోర్టు ఎలాంటి తీర్పు ఇచ్చినా అది చారిత్రాత్మక నిర్ణయం అవుతుంది. పార్టీ మార్పిడి నిరోధక చట్టం గౌరవం నిలుస్తుందా? కాగితం పులిగా మిగులుతుందా? అనేది సుప్రీం తీర్పుపై ఆధారపడి ఉంటుంది. ■

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయానికి కాంగ్రెస్ దోహదపడిందనేది ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తూ పలువురు రాజకీయ పండితులు చేసిన వ్యాఖ్యానం. ఆ ఎన్నికల్లో మొత్తం 70 స్థానాలకు గాను బీజేపీ 45.56 శాతం ఓట్లతో 48 సీట్లను గెలుచుకొని అధికారంలోకి రాగా, 11 ఏండ్లుగా ప్రభుత్వాన్ని నడుపుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) 43.57 శాతం ఓట్లతో కేవలం 22 సెగ్మెంట్లకే పరిమితమై అధికారాన్ని కోల్పోయింది. గెలిచిన బీజేపీ, ఓడిన 'ఆప్'కి మధ్య ఓట్ల తేడా రెండు శాతం మాత్రమే. ఆ పార్టీతో పొత్తు వద్దని ఒంటరిగా బరిలోకి దిగిన కాంగ్రెస్ పార్టీ 6 శాతం ఓట్లతో డిపాజిట్లు కోల్పోయింది.

కాంగ్రెస్ పతనం.. దేశవ్యాప్తం!

గండ్ర వెంకటరమణారెడ్డి

కాంగ్రెస్ పార్టీ 1998 నుంచి 2013 వరకు వరుసగా 15 ఏండ్లపాటు ఢిల్లీని పాలించింది. ఆ తర్వాత వరుసగా ఓడిపోతూ క్రమంగా ఉనికి కోల్పోతున్నది. మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల్లోనూ ఆ పార్టీకి పరాభవం తప్పలేదు. కర్ణాటక, తెలంగాణల్లో గెలిపించిన సంక్షేమ పథకాలు, గ్యారెంటీలు ఆ రాష్ట్రాల్లో బెడిసికొట్టాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఐదు గ్యారెంటీల మంత్రం పనిచేయలేదు. మహారాష్ట్ర అసెంబ్లీలో మొత్తం 288 నియోజకవర్గాలుండగా కాంగ్రెస్ పార్టీ 101 స్థానాల్లో పోటీ చేసి కేవలం 16 స్థానాల్లో మాత్రమే గెలిచింది. గతంలో ఎన్నడూ లేనంతగా అక్కడ కేవలం 12.42 శాతం ఓట్లకే పరిమితమైంది.

కాంగ్రెస్ కూటమి నమ్ముకున్న గ్యారెంటీల వ్యూహం కర్ణాటక, తెలంగాణల్లో ఫలించింది కానీ, హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీల్లో బెడిసికొట్టింది. కర్ణాటక, తెలంగాణల్లో గ్యారెంటీలతో గెలిచిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వాటి అమలులో విఫలం కావడంతో ఆ పార్టీ విశ్వసనీయత దెబ్బతిన్నది. తెలంగాణలో రేవంత్‌రెడ్డి పాలనను చూపించి ఇతర రాష్ట్రాల్లో గట్టెక్కాలనుకున్న కాంగ్రెస్ కుయుక్తుల్ని అక్కడి ఓటర్లు నమ్మలేదు. ఝార్ఖండ్‌లో కాంగ్రెస్ కూటమి గెలిచినప్పటికీ అక్కడ పెద్దన్న పాత్ర జేఎంఎం పార్టీదే. హేమంత్ సోరెన్‌ను జైలుకు పంపడంతో గిరిజనుల్లో ఆయన పట్ల వెల్లువెత్తిన సానుభూతితో జేఎంఎం కూటమి గెలిచిందే తప్ప అక్కడ కాంగ్రెస్ చేసిన మ్యాజిక్ ఏమీ లేదు. ఇక, మహారాష్ట్రలో కాంగ్రెస్ దారుణ ఓటమి నేపథ్యంలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తుకు 'ఆప్' ముందుకు రాలేదు. కాంగ్రెస్ ప్రస్తుతం కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌ల్లో మాత్రమే అధికారంలో ఉన్నది. ఈ మూడు రాష్ట్రాల్లోనూ ఇచ్చిన హామీలు నెరవేర్చలేక ఆపసోపాలు పడుతున్నది. హిమాచల్ ప్రదేశ్‌లో అయితే ఉద్యోగులకు వేతనాలు కూడా చెల్లించలేనంతగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది.

కర్ణాటకలో 'ముడా' (మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) భూ కేటాయింపుల కేసు, వాల్మీకి స్కాంలో కాంగ్రెస్ కూరుకుపోవడం, వాల్మీకి స్కాంలో తెలంగాణ కాంగ్రెస్ నేతలకూ సంబంధం ఉన్నట్టు ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ అంటేనే కరప్షన్, కమిషన్లు అనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతున్నది. ఇలా నానాటికీ ప్రజా వ్యతిరేకత మూటగట్టుకుంటున్న కాంగ్రెస్ మరోసారి గెలవడం అంత సులభం కాదని అర్థమవుతున్నది.

క్షేత్రస్థాయిలో పరిస్థితులు కాంగ్రెసుకు వ్యతిరేకంగా ఉండగా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం మొన్నటి లోకసభ ఎన్నికలు సెమీఫైనల్స్ మాత్రమేనని, 2029లో జరిగే ఎన్నికలు ఫైనల్స్ అని, అందులో గెలిచి రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారంటూ పగటి కలలు కంటున్నారు. 2009 తర్వాత తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో వరుసగా రెండోసారి కాంగ్రెస్ గెలిచిన దాఖలాలు లేవు. 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనతో ఏర్పడిన రెండు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ గెలవలేకపోయింది. అంతకు ముందు వరుసగా రెండుసార్లు గెలిచిన కాంగ్రెస్ ఆ తర్వాత ఏపీలో కనుమరుగైంది. ఢిల్లీలో వరుసగా మూడుసార్లు గెలిచిన కాంగ్రెస్ 2013 నుంచి ఉనికినే కోల్పోయింది. అసోంలోనూ వరుసగా మూడుసార్లు గెలిచిన హస్తం పార్టీ ఆ తర్వాత వరుసగా రెండుసార్లు ఓడిపోయింది. 2023 డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో అధికారాన్ని నిలబెట్టుకోలేకపోయింది. అంతకు ముందు పంజాబ్‌లో సైతం అలాగే చతికిలపడింది.

మహారాష్ట్ర, యూపీ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, బీహార్, ఏపీ, ఒడిశా, ఝార్ఖండ్, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో కాంగ్రెసు పార్టీ ఉనికి నామమాత్రమే. ఈ రాష్ట్రాల్లో మిత్రపక్షాలపై ఆధారపడి కొన్ని సీట్లలో పోటీ చేసి గెలుస్తున్నదే తప్ప స్వయంగా గెలిచే బలాన్ని ఎప్పుడో కోల్పోయింది. ఒకప్పుడు అధికారంలోనో, ప్రధాన ప్రతిపక్షంగానో ఉన్న ఈ పెద్ద రాష్ట్రాల్లో ఇప్పుడా పార్టీ స్థానాన్ని ప్రాంతీయ పార్టీలో, బీజేపీనో ఆక్రమించాయి. ఢిల్లీలో 'ఆప్', ఏపీలో 'వైసీపీ', ఒడిశాలో బీజేపీ ఆ స్థానాన్ని లాక్కున్నాయి. ఇప్పుడు ఇదే పరిస్థితి తెలంగాణలో ఎదురయ్యే అవకాశం లేకపోలేదు. ఢిల్లీలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ 2013 ఎన్నికల్లో ఏకంగా మూడో స్థానానికి పడిపోయింది. ఇదే పరిస్థితి తెలంగాణలోనూ ఎదురయ్యే అవకాశం ఉన్నది.

కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదుగుతుండటంతో, ఎన్నికల్లో ఓడిపోతున్న కాంగ్రెస్ పార్టీ మళ్లీ కోలువడం లేదు. ఢిల్లీ, ఒడిశా ఉదంతాలు దీనిని రుజువు చేస్తున్నాయి. రాష్ట్రాన్ని సాధించిన పార్టీగా బీఆర్ఎస్ ఇప్పుడు ప్రతిపక్షంగా ఉండి పుంజుకుంటుందే తప్ప ఎట్టి పరిస్థితుల్లోనూ బలహీనపడదు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల ఉనికి బలీయమైనది. తమిళనాడులో అయితే కాంగ్రెస్, బీజేపీ వంటి జాతీయ పార్టీలు అక్కడ బలంగా ఉన్న డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలలో ఏదో ఒకదానితో పొత్తు పెట్టుకోవాల్సిందే తప్ప, మరో దారి లేకుండా పోయింది. ప్రాంతీయ సెంటిమెంట్లు బలంగా ఉండే ఈ రాష్ట్రాల్లో స్థానిక పార్టీలు కొన్ని సందర్భాల్లో ఒడిదొడుకులకు లోనుకావచ్చు కానీ, ఉనికికి మాత్రం ఢోకా లేదు. రేవంత్ సర్కారు ఇలాగే వైఫల్యాల బాటలోనే సాగితే వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలో కాంగ్రెస్ పుట్టి మునగడం ఖాయం. అప్పుడు యూపీ, బెంగాల్, తమిళనాడు, బీహార్, ఏపీ, ఒడిశా, ఝార్ఖండ్, ఢిల్లీ రాష్ట్రాల్లో మాదిరి ఇక్కడ కాంగ్రెస్ పరిస్థితి మనుగడే ప్రశ్నార్థకమవుతుంది.

(వ్యాసకర్త: మాజీ ఎమ్మెల్యే, భూపాలపల్లి)